ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 17-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించిన జీశాట్-ఎన్2 ఉపగ్రహన్ని రేపు ప్రయోగించనున్నారు.
- ఉగ్రవాదం, పైరసీ నిర్మూలనకు నైజీరియా, భారత్ దేశాలు సమిష్టిగా పనిచేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నైజీరియా ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది నైజర్' అవార్డును ఇచ్చి సత్కరించింది.
- రానున్న ఐదు రోజుల్లో వాయువ్య, మధ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని భారత వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైజీరియాతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపరిచేందుకు భారతదేశం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు నైజీరియా చేరుకున్న ప్రధాని అబుజాలోని నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భముగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, రక్షణ, శక్తి, సాంకేతికత, ఆరోగ్యం, విద్య, సంస్కృతి రంగాలలో ఇరుదేశాలు తమ సహకారాన్ని పంచుకుంటున్నాయని అన్నారు. అలాగే ఉగ్రవాదం, పైరసీ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి నైజీరియా, భారత్ దేశాలు సమిష్టిగా పనిచేస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నైజీరియా ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది నైజర్' గ్రాండ్ కమాండర్ ను ఇచ్చి సత్కరించింది. 1969లో క్వీన్ ఎలిజబెత్‌కు నైజీరియా ఈ అవార్డును ప్రదానం చేసింది. అనంతరం ఈ గౌరవాన్ని అందుకున్న విదేశీ ప్రముఖుడిగా నరేంద్రమోదీ నిలిచారు. విదేశాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందుకున్న అత్యున్నత అంతర్జాతీయ అవార్డుల్లో ఇది 17వ పురస్కారం. ఈ సందర్భముగా ఈ పురస్కారం భారతదేశానికి, ఇండియా-నైజీరియా మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న బంధానికి దక్కిన గౌరవంగా ప్రధానమంత్రి పేర్కొంటూ..

బైట్.. ప్రధానమంత్రి (35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పంజాబ్ కేసరి లాలా లజపత్ రాయ్ వర్ధంతి సందర్భముగా దేశవ్యాప్తంగా ఆయనకు నివాళి అర్పించారు. పంజాబ్ లోని మోఘా జిల్లా ధుడీకే గ్రామంలో 1865 జనవరి 28వ తేదీన జన్మించిన ఆయన బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ తో కలసి లాల్-బాల్-పాల్ త్రయంలో ఒకరుగా ప్రసిద్ధి చెందారు. 1928లో భారతదేశ పర్యటనకు వచ్చిన సైమన్ కమిషన్ ను వ్యతిరేకిస్తూ లాలా లజపతిరాయ్ చేసిన ఆందోళన బ్రిటిష్ ఇండియా చరిత్రలో చాలా ప్రముఖమైంది. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఒకరుగా చిరస్థాయిగా నిలిచిన లాలా లజపతిరాయ్ 1928, నవంబరు 17న తుది శ్వాస విడిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సేవలను అందించే లక్ష్యంతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించిన జీశాట్-ఎన్2 ఉపగ్రహన్ని రేపు ప్రయోగించనున్నారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహం నింగిలోకి వెళ్లనుంది. భారత కాలమానం ప్రకారం రేపు మధ్యాహ్నం 1:30 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. అండమాన్ నికోబార్, లక్షద్వీప్ వంటి ద్వీపాల్లోనూ వేగవంతమైన ఇంటర్నెట్ సేవలను అందుబాటులో తేవటమే ఈ ప్రయోగం లక్ష్యం. అంతేకాకుండా జీశాట్-ఎన్2 ఉపగ్రహం ద్వారా విమానాల్లో వై-ఫై సేవలు మరింత విస్తృతం కానున్నాయి. దాదాపు 4 వేల 7 వందల కిలోల బరువు గల ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకువెళ్లేందుకు ఇస్రోకు చెందిన ఎంకె-3 వాహక నౌకకు సాధ్యం కానందువల్ల భారత్, అమెరికా అంతరిక్ష ఒప్పందాల్లో భాగంగా స్పేస్ ఎక్స్ సంస్థతో కలిసి జి-శాట్ ఎన్ 2 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'ఏక్ పెడ్ మా కే నామ్'కు ప్రచార కార్యక్రమాన్ని ఆదరించి ముందుకు తీసుకువెళ్తున్న వారందరికీ ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు తమ తల్లి గౌరవార్థం ఒక చెట్టును నాటి తద్వారా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, మరింత సుసంపన్నమైన భవిష్యత్తును నిర్మించడంలో సహకరించాలని కోరారు. పర్యావరణాన్ని మెరుగుపరచడానికి సమిష్టి కృషి ఎంతో అవసరమని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2024 సందర్భంగా జూన్ 5న ఢిల్లీలోని బుద్ధ జయంతి పార్కులో పీపాల్ చెట్టును నాటడంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఏక్ పెడ్ మా కే నామ్' ప్రచారాన్ని ప్రారంభించారు.

===========================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్టు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రకటించారు. మొదటిసారి జరిగిన ఈ పరీక్షతో దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణులు కలిగిన దేశాలలో భారతదేశం కూడా చేరిందని ఆయన పేర్కొన్నారు. ఒడిషా తీరంలోని డాక్టర్ ఎ.పి. జె. అబ్దుల్ కలాం ద్వీపంలో జరిగిన ఈ పరీక్ష, భారత రక్షణ వ్యవస్థలో ఒక మైలు రాయి వంటిదని సామాజిక మాధ్యమం ఎక్స్ లో రక్షణ శాఖ పేర్కొంది. 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఇది ఛేదించగలదని, వివిధ రకాల వార్‌హెడ్‌లను అమర్చేలా దీనిని రూపొందించారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(IMD) వెల్లడించింది. రానున్న ఐదు రోజుల్లో వాయువ్య, మధ్య, తూర్పు, పశ్చిమ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గుతుందని పేర్కొంది. అలాగే పంజాబ్, హర్యానా, వాయువ్య రాజస్థాన్‌తో పాటు బీహార్‌లో దట్టమైన పొగమంచు ఉంటుందని వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత పవిత్రమైన బద్రీనాథ్ ఆలయాన్ని శీతాకాలం నేపధ్యంలో ఈ రాత్రి 9 గంటలకు మూసివేయనున్నారు. దీంతో ఏడాదికి సంబంధించిన వార్షిక చార్ ధామ్ యాత్ర ఈరోజుతో అధికారికంగా ముగియనుంది. మూసేవేతకు ముందు, ఆలయాన్ని 15 క్వింటాళ్ల పూలతో అలంకరించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సంవత్సరం, 14లక్షల 25వేల మంది యాత్రికులు బద్రీనాథ్‌ను సందర్శించారని అధికారులు తెలిపారు. మే 10న కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి ద్వారాలు తెరవడంతో ప్రారంభమైన చార్ ధామ్ యాత్రలో 45.5 లక్షల మంది యాత్రికులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శబరిమల అయ్యప్ప ఆలయానికి వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఆలయానికి చేరుకొనే అన్ని ప్రధాన మార్గాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. యాత్ర సమయంలో భక్తులకు పలు సూచనలు చేసింది. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపధ్యంలో పంబాలో పలు భాషలు మాట్లాడే వైద్యులు, వాలంటీర్లతో నిరంతర సేవల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. భక్తులు వైద్య సాయం కోసం 04735203232 నంబర్ కు ఫోన్ చేయాలని తెలిపింది. నీలిమల, పంబ, అపచిమేడు, సన్నిధానం ఆస్పత్రుల్లో గుండె సంబంధిత, వైద్య పరీక్షలు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మిస్ యూనివర్స్-2024 పోటీల్లో డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా కెజార్ హెల్విగ్ విశ్వ సుందరి కిరీటాన్ని గెలుచుకున్నారు. మెక్సికో వేదికగా జరిగిన ఈ పోటీలలో 125 మంది పాల్గొనగా 21 ఏళ్ల విక్టోరియా కెజార్ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన చిడిమ్మ అడెట్షినా, మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండా బెల్ట్రాన్ మొదటి, రెండో స్థానాలల్లో నిలిచారు. ఈమేరకు మిస్ యూనివర్స్ 2023 విజేత షెన్నిస్ పలాసియోస్ కెజార్ హెల్విగ్ కు కిరీటాన్ని అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని దిల్లీలో వరుసగా ఐదో రోజు వాయునాణ్యత సూచీ 428గా నమోదైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =